ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 15 ఏప్రిల్ 2025





మహబూబాబాద్‌ శివారు అనంతారం రోడ్డులో నత్తనడకన నిర్మాణమవుతున్న మునిసిపల్‌ భవనం



అనంతారం రోడ్డులో నిర్మాణమవుతున్న మునిసిపల్‌ నూతన భవనంలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు

సొంత భవనాల్లేవ్..

మునిసిపల్‌ కార్యాలయాలు కరువు

- గ్రామ పంచాయతీ ఆఫీసుల్లోనే కార్యకలాపాలు
- మానుకోటలో ఆగుతూ సాగుతూ ఆరేళ్లుగా బిల్డింగ్‌ నిర్మాణం
- మిగతా నాలుగింటికి మోక్షమెప్పుడో?
- త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలంటున్న ప్రజలు
- అన్ని హంగులతో కొత్తవి నిర్మించాలని డిమాండ్‌

మహబూబాబాద్‌ టౌన్‌, ఏప్రిల్‌ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు సొంత భవనాలు కరువయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మహబూబాబాద్‌ జిల్లాలో మునిసిపాలిటీలుగా ఆవిర్భవించి, పాలక మండళ్ల పదవీకాలం పూర్తయినా జీపీ ఆఫీసుల్లోనే సరిపెట్టుకుంటున్నారు. మానుకోట పట్టణంలో మునిసిపాలిటీ భవన నిర్మాణం ఆరంభమైనప్పటికి.. నిధుల లేమితో ఆరేళ్లుగా ఆగుతూ... సాగుతూ ఇప్పటికీ పూర్తికాలేదు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక మిగిలిన తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌ మునిసిపాలిటీల కార్యాలయాల నిర్వహణ సైతం పూర్వ గ్రామ పంచాయతీ భవనాల్లోనే కొనసాగుతోంది.

జిల్లాలో కొత్తగా ఏర్పడిన కేసముద్రం మునిసిపాలిటీ ఆఫీస్‌ను స్టేషన్‌ కేసముద్రం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేశారు. కమిషనర్‌, ఆర్‌ఐ మినహా పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం జరగలేదు. గతంలో చాలీచాలని జీపీ భవనాల్లోనే అరకొర వసతుల నడుమ మునిసిపల్‌ కార్యాలయాలు కొనసాగడంతో అటు ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం ఆఫీస్‌లకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్‌ జిల్లాలోని మునిసిపాలిటీలకు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా మునిసిపాలిటీల ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

మానుకోటలో భవన నిర్మాణానికి 2018లో శంకుస్థాపన..

మహబూబాబాద్‌ మేజర్‌ గ్రామ పంచాయతీని 2011లో మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాడు పూర్వ జీపీ భవనంలోనే మునిసిపల్‌ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అందులోనే కొనసాగుతోంది. జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటైన మానుకోట మునిసిపాలిటీకి 2014లో తొలిసారి ఎన్నికలు జరిగి నూతన పాలకమండలి కొలువుదీరింది. స్వరాష్ట్రం సిద్ధించాక పాలనా సౌలభ్యం కోసం 11 అక్టోబరు, 2016న మానుకోట జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైంది. మానుకోట పట్టణంలో మునిసిపాలిటీ నూతన భవన నిర్మాణానికి 2018లో అప్పటి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించింది. ఈ క్రమంలో అనంతారం రోడ్డులో రెండు ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అందులో 2018 ఏప్రిల్‌, 4న కలెక్టరేట్‌ కాంప్లెక్స్‌, ఎస్పీ కార్యాలయాలతో పాటు మునిసిపల్‌ భవన నిర్మాణ పనులకు నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ శంకుస్థాపన చేశారు.

ఆరేళ్లుగా ఆగుతూ.. సాగుతూ..

మహబూబాబాద్‌ పట్టణంలోని అనంతారం రోడ్డులో మునిసిపల్‌ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన ఆ భూమి తమదంటూ కొంత మంది అడ్డుపడడంతో నిర్మాణ పనుల ప్రారంభం ఆలస్యమైంది. కొంతకాలం తర్వాత జీ ప్లస్‌-1 భవన నిర్మాణ పనులు షురువు అయినప్పటికి ప్రంత్‌ బీం లెవల్‌ వరకు పనులు జరగగా.. అప్పటి కాంట్రాక్టర్‌ ఆ పనులను మధ్యలోనే నిలిపివేసి చేతులెత్తేశారు. దీంతో మునిసిపల్‌ అధికారులు ఆ కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చి వర్క్‌ క్యాన్సల్‌ చేసి, మిగిలిన పనులకు మళ్లీ టెండర్‌ పిలిచారు. పూర్వంలో రూ.90 లక్షల మేర పనులు జరిగినట్లుగా అధికారుల అంచనా వేసి మిగిలిన రూ.4.10 కోట్ల పనులకు టెండర్‌ పిలవగా.. మరో కాంట్రాక్టర్‌ దక్కించుకుని పనులను ఆరంభించారు. జీ ప్లస్‌-1 భవన నిర్మాణ పనులు ఇటీవల చివరి దశకు చేరుకున్నాయి. రూ.4 కోట్లకుగాను అరకొర నిధులు మాత్రమే మంజూరు కావడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫినిషింగ్‌ (గ్రానైట్‌, ఫ్లోరింగ్‌ ఇతరత్రా) పనులు ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుతం ఉన్న భవనం సరిపోక ఇరుకు గదుల్లోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే రెండు పాలక మండళ్ల పదవీ కాలం పూర్తయినప్పటికి వారు కొత్త భవనంలో అడుగు పెట్టలేదు. ముచ్చటగా మూడో పాలకమండలి కొలువు దీరే సమయానికైనా భవనం పూర్తవుతుందో లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



స్టేషన్‌ కేసముద్రం జీపీ భవనంలో ఏర్పాటు చేసిన కేసముద్రం మునిసిపల్‌ కార్యాలయం

తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌ మునిసిపాలిటీలు సైతం

మహబూబాబాద్‌ జిల్లాలో 2018 ఆగస్టులో ఏర్పాటైన తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌ మునిసిపాలిటీలు సైతం పూర్వ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే కొనసాగుతున్నాయి. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరు మునిసిపాలిటీ భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.3 కోట్లు మంజూరు అయినప్పటికి స్థల సేకరణలో జాప్యం కావడంతో నిర్మాణాలు మొదలు కాలేదు. ఇక మరిపెడ మునిసిపాలిటీ భవన నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ కేటాయించిన ఎస్డీఎఫ్‌ నిధులు రూ.25 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు కేటాయించి పాత జీపీ భవనం స్థానంలోనే నూతనంగా మునిసిపాలిటీ ఆఫీస్‌ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినప్పటికి ఎస్డీఎఫ్‌ నిధులు మంజూరు కాకపోవడంతో అది కూడా నిర్మాణానికి నోచుకోలేదు.

ఇక డోర్నకల్‌ మునిసిపల్‌ భవనానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ఇక కొత్తగా 2025 జనవరిలో స్టేషన్‌ కేసముద్రం, కేసముద్రం విలేజీ, ధన్నసరి, సబ్‌ స్టేషన్‌తండా, అమినాపురం ఐదు జీపీలతో కలిపి ఏర్పాటు చేసిన కేసముద్రం మునిసిపాలిటీ సైతం స్టేషన్‌ కేసముద్రం గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ ఇంకా పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకం కూడా జరగలేదు. ఏది ఏమైనప్పటికీ జిల్లాలోని మునిసిపాలిటీలకు అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించి అందుబాటులో తీసుకురావాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహబూబాబాద్‌లో అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్‌ రాంచందర్‌నాయక్‌, ఎమ్మెల్యే మురళీనాయక్‌

అంబేద్కర్‌ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ప్రభుత్వ విప్‌ జాటోతు రాంచందర్‌ నాయక్‌
- మానుకోటలో ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కలెక్టర్‌, ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే, అధికారులు



అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌సింగ్‌

మహబూబాబాద్‌, ఏప్రిల్‌ 14 (ఆంధ్రజ్యోతి): మానుకోట జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బీఆర్‌ అంబేద్కర్‌ విగ్రహానికి జిల్లా కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌సింగ్‌, అదనపు కలెక్టర్‌ కె.వీరబ్రహ్మచారి, ప్రభుత్వ విప్‌, డోర్నకల్‌ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌ నాయక్‌, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో పాటు అధికారులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్‌ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఇన్‌చార్జ్‌ అధికారి నర్సింహస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్‌ జాటోతు రాంచందర్‌ నాయక్‌ హాజరై మాట్లాడారు. మహనీయుడు బీఆర్‌ అంబేద్కర్‌ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్‌ మాసంలో మహనీయుల జయంతిలను నిర్వహించుకుంటున్నామని, వారు చూపిన మార్గంలో పయనించాలని కోరారు. కలిసికట్టుగా ఉంటూ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రజలు తమ హక్కులను సాధించుకుంటూ పురోగతి సాధించాలని చెప్పారు. కుల, మతాల మధ్య కొన్ని పార్టీలు చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నాయని వాటిని తిప్పి కొట్టాలన్నారు.

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ మాట్లాడుతూ బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత కాంగ్రెస్‌ సర్కార్‌దని చెప్పారు. మహనీయులు డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ రాజ్యాంగాన్ని రచించి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న నలుగురు జంటలకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చెక్కులను అందించారు. ఆపై వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో

మిగతా 8వ పేజీలో...



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్‌ వాసులు
- కాళేశ్వరం దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలం రాఘవపూర్‌ వద్ద ఘటన


7



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి మృతదేహం



అనూష మృతదేహం

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే

పాల్గొననున్న డీఈడీ, బీఈడీ విద్యార్థులు

మహబూబాబాద్‌ ఎడ్యుకేషన్‌, ఏప్రిల్‌ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు డీఈడీ, బీఈడీ విద్యార్థులు సర్వే చేపట్టనున్నారు. జిల్లాలోని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం (యూడైస్‌)లో నమోదు చేసిన మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎంత మంది ఉన్నారు? ఎక్కువ మంది విద్యార్థుల్ని లెక్కల్లో చూపుతున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం కోసం పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో డైట్‌, బీఈడీ కళాశాలల విద్యార్థులతో సర్వే చేపడుతోంది. మహబూబాబాద్‌ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 102, ప్రాథమికోన్నత పాఠశాలలు 120, ప్రాథమిక పాఠశాలలు 676, మోడల్‌ స్కూల్స్‌ 08, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 15తో కలిసి మొత్తం 921 పాఠశాలలున్నాయి. సాధారణంగా ఈ పాఠశాలల్లో క్లస్టర్‌ రిసోర్సు పర్సన్‌ (సీఆర్పీ)ల ద్వారా సమాచారాన్ని పూర్తి చేసేవారు. కానీ, ఈసారి డీఈడీ, బీఈడీ చదువుతున్న 60మంది విద్యార్థులచే జిల్లాలో ఉన్న 60క్లస్టర్లను సర్వే చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి పాఠశాలలను కేటాయించారు. ఒక్కో విద్యార్థి రోజుకు రెండు చొప్పున పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సంఖ్యతో పాటు మౌలిక వసతులు తదితర వివరాలను సేకరించనున్నారు.

సర్వే చేసేందుకు వచ్చే విద్యార్థులను వారికి కేటాయించిన పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు ఎంఈవోలు, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు, హెచ్‌ఎంలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేకాధికారులు, సీఆర్పీలు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.



కురవి పోలీస్‌స్టేషన్‌లో గంజాయితో పాటు నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ తిరుపతిరావు

రూ.53.28 లక్షల గంజాయి పట్టివేత

- నలుగురు వ్యక్తుల అరెస్టు
- కురవిలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

6

దేశంలో ఆర్‌ఎస్‌ఎస్‌ రాజ్యాంగం అమలవుతోంది

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- బయ్యారంలో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్‌

బయ్యారం, ఏప్రిల్‌ 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ రచించిన రాజ్యాంగానికి బదులు ఆర్‌ఎస్‌ఎస్‌ రాజ్యాంగం అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విమర్శించారు. ఏఐసీసీ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం బయ్యారంలోని కోదండ రామచంద్రస్వామి కల్యాణ మండపంలో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్‌ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ రచించిన రాజ్యంగ హక్కులను బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం కాలరాసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్పొరేట్‌ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక వర్గాన్ని అణగదొక్కాలని చూస్తుందని, నల్ల చట్టాలను అమలు చేసి రైతాంగాన్ని బానిసలుగా మార్చే కుట్రలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఏఐసీసీ పిలుపు మేరకు జై బాపు. జై భీం. జై సంవిధాన్‌ యొక్క ఉద్దేశ్యాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు కంబాల ముసలయ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు భరత్‌ చందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ మూల మధుకర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌ నాయక్‌, వీరారెడ్డి, రాము నాయక్‌, మోహన్‌, వెంకటేశ్వర్లు, లక్ష్మీ, సోమేష్‌, నాగరాజు, శ్రీను, రాంమూర్తి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బయ్యారంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

రూ.53.28 లక్షల గంజాయి పట్టివేత

నలుగురి అరెస్టు : డీఎస్పీ తిరుపతిరావు

కురవి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కురవి మండల కేంద్రం మీదుగా తరలిస్తున్న రూ.53,28,500 విలువైన ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇందులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు నిందితుల అరెస్టు చూపుతూ వివరాలను వెల్లడించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాలతో ఆదివారం మధ్యాహ్నం ఎస్సై గండ్రాతి సతీష్ కురవిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓం ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డుపై అనుమానాస్పదంగా ఆగివున్న ఒడిశా నెంబరు ఓడి 02 ఏజె 3351 గల కారును ఎస్సై సిబ్బందితో తనిఖీ చేశారు. 3 బస్తాల ఎండు గంజాయి లభించగా, కారులోని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఆపై కారులోని గంజాయిని తూకం వేయగా, 106 కిలోల 960 గ్రాములు ఉందని, బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.53 లక్షలు ఉంటుందని తెలిపారు.

మరిపెడ మండలం తండ ధర్మారంకు చెందిన బానోత్ మహేందర్, ఒడిశా మల్కన్‌గిరి జిల్లా గుద్నాడ్గ గ్రామానికి చెందిన నర్సింగ్ మడి, రామచంద్ర మడి, అదే జిల్లా బెదురుపల్లికి చెందిన చంద్ర మాడ్కమిలు ఒడిశాలోని చిత్రకొండ వద్ద గంజాయిని కొనుగోలు చేశారని డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. కారులో విశాఖపట్నం మీదుగా ఖమ్మం తీసుకువచ్చి మరిపెడ, కురవి మీదుగా హైదరాబాద్‌లో గంజాయిని అమ్మేందుకు ప్లాన్ చేసుకున్నట్లు చెప్పారు. కురవి ఎస్సై సతీష్ తనిఖీల్లో గంజాయి స్మగ్లర్లు దొరికిపోయినట్లు పేర్కొన్నారు. స్మగ్లర్లు నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్సై సతీష్, ఏఎస్సై జి.వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్‌రావు, కానిస్టేబుళ్లు సమ్మయ్య, బి.రమేష్, హరిబాబు, కాశీరామ్, భద్రు, గణపతిలను డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఎవరికీ పట్టని కార్మికుల కష్టాలు

- తొర్రూరు కార్మిక శాఖ పరిధిలోకి కేసముద్రం
- పథకాల వర్తింపు కోసం కార్మికుల ఇబ్బందులు
- మానుకోట పరిధిలోకి మార్చాలని డిమాండ్
- కేసముద్రం మండలంలో 5 వేల మంది.. జిల్లాలో 82 వేల మంది కార్మికులు

కేసముద్రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమాన్ని పాలకులు గాలికి వదిలేశారనడానికి ఇదో ఉదాహరణ. కొత్త జిల్లాలు ఏర్పడితే కార్యాలయాలు మరింత దగ్గర అవుతాయని అందరూ భావిస్తారు. ఇందుకు భిన్నంగా 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని పట్టణానికి మార్చి కార్మికులను వ్యయ ప్రయాసలకు గురిచేస్తుండడమే గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో కార్మిక శాఖ పరిధిలో మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ కేంద్రాల్లో సహాయ కార్మిక శాఖ అధికారి (ఏఎల్‌వో) కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 82,919 మంది భవన నిర్మాణం, ఇతర రంగాల్లోని కార్మికులు నమోదై ఉన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు 12,925 మంది కార్మికులకు రూ.73.13 కోట్ల పరిహారాన్ని కార్మిక శాఖ ద్వారా అందించారు. జిల్లా ఏర్పడక ముందు గూడూరు, కొత్తగూడ మండలాలు నర్సంపేట ఏఎల్‌వో పరిధిలో ఉండగా, బయ్యారం, గార్ల మండలాలు ఇల్లెందు ఏఎల్‌వో పరిధిలో ఉన్నాయి. 2016లో మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు అనంతరం కార్మిక శాఖలో మండలాల విభజనను చేశారు. మహబూబాబాద్ ఏఎల్‌వో కార్యాలయ పరిధిలో మహబూబాబాద్, గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి మండలాలు, తొర్రూరు ఏఎల్‌వో పరిధిలో తొర్రూరు, పెద్దవంగర, కేసముద్రం, నెల్లికుదురు, నర్సింహులపేట, దంతాలపల్లి, మరిపెడ, చిన్నగూడూరు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని సంఘటిత, అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాలను అమలు చేయడం ఏఎల్‌వో కార్యాలయాల విధి. కార్మికులకు ప్రమాదాలు జరిగిన సమయంలో వాటి పరిహారాన్ని పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

భవన నిర్మాణ కార్మికుల పథకాలివే..

రాష్ట్ర కార్మిక శాఖ నుంచి భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించే పథకాలు అమలవుతున్నాయి. కార్మిక శాఖలో నమోదై ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.1లక్ష పరిహారం ఇస్తారు. ఆస్పత్రి ఖర్చులను గరిష్ఠంగా నెలకు రూ.4500 చొప్పున, రోజుకు రూ.300 చొప్పున అందిస్తారు. అంత్యక్రియలకు రూ.30వేలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, మహిళా కార్మికులకు ప్రసూతి అయితే రూ.30వేల సహాయాన్ని అందిస్తారు. కృత్రిమ అవయవాల కొనుగోలుకు నిధులను మంజూరు చేస్తారు. ఇవేకాకుండా కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఉపకార వేతనం ఇస్తూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు కాని వ్యక్తి పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.50వేలు, అంగవైకల్యానికి రూ.20వేలు పరిహారం ఇస్తారు. ఇవేకాకుండా తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, ట్రస్ట్‌లలో పనిచేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమచేసే కార్మికులకు పథకాలు అమలు చేస్తున్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

32 కిలోమీటర్ల దూరంతో వ్యయప్రయాసలు..

మహబూబాబాద్ జిల్లాలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని మానుకోట ఏఎల్‌వో పరిధిలోంచి తొర్రూరు ఏఎల్‌వో పరిధిలోకి మార్చడం కార్మికులను వ్యయప్రయాసలకు గురిచేస్తోంది. కేసముద్రంలోని ప్రధాన కార్మిక సంఘాలకు అనుబంధంగా గుమాస్తాలు, హమాలీ వర్కర్స్ బండ్ల హమాలీలు, పసుపు డోలా, గ్రానైట్ క్వారీ, భవన నిర్మాణ కార్మిక, ట్రాన్స్‌పోర్ట్ కార్మిక, సివిల్ సప్లయిస్ హమాలీ, మిల్లు డ్రైవర్స్, పెయింటింగ్ వర్కర్స్, ట్రాక్టర్ డ్రైవర్స్, మధ్యాహ్న భోజన కార్మిక, దడువాయి, అంగన్‌వాడీ, ఐకేపీ సీఏలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, రిక్షా, కిరాణా షాపు, హోటళ్లలో పనిచేస్తున్న వారితో కార్మిక సంఘాలు ఉన్నాయి. వీరే కాకుండా ఉపాధి హామీ పథకం కూలీలు, బిహార్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు వెరసి 5వేలకు పైగా మంది కార్మికులు కేసముద్రం మండలంలో ఉన్నారు. వీరందరికీ కార్మిక శాఖ నుంచి సంక్షేమ పథకాలకు రావాల్సిన ప్రయోజనాలు, ప్రమాదాలకు అందాల్సిన పరిహారం పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొర్రూరులోని కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లిరావడం కార్మికులు, వారి కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. 32 కిలోమీటర్ల దూరంతోపాటు కేసముద్రం నుంచి రవాణా సౌకర్యాలు సక్రమంగా లేని తొర్రూరుకు వెళ్లి వచ్చేందుకు ఒక రోజంతా సమయం పడుతోంది. ఇప్పటికైనా కేసముద్రం మండలాన్ని గతంలో ఉన్నట్లుగానే మహబూబాబాద్ ఏఎల్‌వో పరిధిలోకి మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలా వీలుకాని పక్షంలో తొర్రూరులోని ఏఎల్‌వో కార్యాలయాన్ని అధిక సంఖ్యలో కార్మికులతో పారిశ్రామిక కేంద్రంగా పేరున్న కేసముద్రానికి తరలించాలని, ఈ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలోని ఏఎల్‌వోల పరిధిలో ఉన్న కార్మికులు

ప్రాంతం పేరు	ఏఎల్‌వోగా నమోదైన వారు	రెన్యువల్ చేసుకోని వారు	కొనసాగుతున్న వారు
మహబూబాబాద్	38,303	14,116	24,187
తొర్రూరు	44,616	15,162	29,454
మొత్తం	82,919	29,278	53,641

చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కరించాలి



వేలాది మంది కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్మిక శాఖ కార్యాలయాన్ని తొర్రూరు పరిధి నుంచి మహబూబాబాద్ పరిధికి మార్చాలి. దీనికి అనుగుణంగా ప్రస్తుత పాలకులు చట్టసభల్లో సమస్యను ప్రస్తావించి పరిష్కారం చూపాలి. శాసనసభ గెజిట్ ద్వారా కార్యాలయాన్ని మార్చే వీలుంది. ఈ మేర కు శాసనసభ సభ్యులు చొరవ చూపాలి.

కంచ వెంకన్న, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు, కేసముద్రం

కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు..



పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు ఏఎల్‌వో కార్యాలయానికి కలపడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులకు పరిహారం కోసం దరఖాస్తు చేసేందుకు వ్యయప్రయాసలకు గురవు తున్నారు. కేసముద్రంలోనే నూతన ఏఎల్‌వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

ఎం మురళి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, కేసముద్రం

రసాభాసగా అంబేద్కర్ జయంతి కార్యక్రమం

ములుగు కలెక్టర్ తీరుపై అభ్యంతరం

ములుగు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమం రసాభాసగా ముగిసింది. జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు ఏర్పాట్ల పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారని, అయితే 200 మందిలోపు కూర్చునే వీలున్న కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మహనీయుడికి నివాళులర్పించకుండా సీఎంతో సమావేశమంటూ కలెక్టర్ వెళ్లిపోవడం సరికాదన్నారు. పొరుగు జిల్లాల్లో అక్కడి కలెక్టర్లు అంబేద్కర్‌కు నివాళులర్పిస్తే ములుగు కలెక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రతినిధు లుగా ఉండే అధికారులు కేవలం అధికార పార్టీకే అనుకూలంగా వ్యవహరించడం ప్రజామోదం కాదన్నారు. ఇదేక్రమంలో పలువురు దళిత, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగిస్తుండగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన వ్యక్తి వారిని ప్రసంగం త్వరగా ముగించాలంటూ పదేపదే కోరడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. మహనీయుల కార్యక్రమాలు నిర్వహించడంలో ములుగు జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ పలువురు నాయకులు ఆరోపించారు.

వరుస చోరీలు

వెంకటాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఉప్పేడు గొల్లగూడెం, మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఆదివారం రెండు చోరీలు జరిగాయి. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు ఇంట్లో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ఎదుట ఉన్న షట్టర్ పగులగొట్టి రూ.50 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. అలాగే మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు సంకా హేమసుందర్ ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టి కిలో వెండి వస్తువులు, 18గ్రాముల బంగారు నగలను ఎత్తుకె ళ్లారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పుష్కర స్నానాలకు నీటి కష్టాలు



గోదావరిలో పుష్కరఘాట్ వద్ద నీటి ప్రవాహం లేక తేలిన బండరాళ్లు

మహదేవపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో దివ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, సరస్వతి పుష్కరాలకు నీటి ఎద్దడి సమస్య ఉంది. పుణ్య స్నానాలు ఆచరించడానికి నీటి సమస్య ఉంది. త్రివేణి సంగమంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ పట్టణ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. త్రివేణి సంగమంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం ఉండగా గోదావరి ప్రవాహం ఎగువ నుంచి ఏ మాత్రం లేదు. సరస్వతి నదీ ప్రవాహం అంతర్వాహినిగా ఉండి కనిపించదు. ప్రాణహిత ప్రవాహంతోనే కాళేశ్వరంలో నీటి కళ ఉండేది. వేసవి కావడంతో ప్రాణహిత నుంచి ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం తక్కువగా ఉంది. సుమారు నిత్యం 3,125 క్యూసెక్కుల మేర ప్రాణహిత ప్రవాహం రోజువారీగా ఉంటుంది. ఏప్రిల్ ముగిసి మేలో మండుటెండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో ప్రాణహిత ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉంది. ప్రధాన పుష్కర ఘాట్లలో బండరాళ్లు తేలి నీటి ప్రవాహం భక్తులకు ఇబ్బందులు తప్పేట్లు లేవు. ప్రధాన పుష్కర ఘాట్ నుంచి బోటులో వెళ్లి ప్రాణహిత వైపున స్నానాలు చేయడానికి సౌకర్యవంతంగా ఉంది. సరస్వతి ఘాట్ నుంచి నీటి ప్రవాహం వరకు ఇసుకను తొలగిస్తే వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వీలు ఉంటుంది. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివస్తున్నారు. ఈ క్రమంలో పుష్కరఘాట్ల వద్ద నీటి నిల్వలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ యువతకు సూచించారు. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామంలో సోమవారం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేకాకుండా శిక్షణ పొందిన నార్కోటిక్ స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందాలతో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్, పోక్సో చట్టాల అవగాహన సదస్సులో ఏఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్‌లపై గ్రామాల్లో యువత, విద్యార్థులను చైతన్యం చేయడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేయడం, వాటిని తీసుకోవడం ద్వారా యువత, విద్యార్థులు అనేక నష్టాలు, సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు డ్రగ్స్ సరఫరా చేసినా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, పోలీస్, స్నిఫర్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేపర్ కర్మాగారాన్ని పునఃప్రారంభించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేతలు
- బిల్ట్ కార్మికులతో కలిసి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న మానవ హక్కుల వేదిక నేతలు, బిల్ట్ కార్మికులు

ఏటూరునాగారం/మంగపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం పేపర్ కర్మాగారాన్ని ప్రభుత్వం వెంటనే పునఃప్రారంభించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాధవత్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కమలాపురం బిల్ట్ కార్మికరంగాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బెల్ట్ కార్మికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట ప్రారంభమైన పాదయాత్ర అక్కడి నుంచి కమలాపురంలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 1977లో ఏపీ రేయాన్స్‌గా ప్రారంభమైందని, ముదున్నర దశాబ్దాల్లో రూ. 9 వేల కోట్ల లాభాలు ఆర్జించినప్పటికి, నష్టాల సాకుతో 2014లో మూసివేశాయని, దీంతో దాదాపు 2వేల మంది శాశ్వత తాత్కాలిక కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జేఏసీ నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కై, కార్మికులకు రావాల్సిన న్యాయపరమైన బకాయిలను అందకుండా చేశారని రాజు ఆరోపించారు. కార్మికులు హైకోర్టును ఆశ్రయించగా, జీతభత్యాలు వెంటనే చెల్లించాలని ఆదేశించినప్పటికి యాజమాన్యం, జేఏసీ నాయకులు, రాజకీయ పార్టీల నాయకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి వారికి బకాయిలు అందలేదని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కర్మాగారాన్ని వెంటనే తెరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు రావాల్సిన పాత బకాయిలను చెల్లించాలని, కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మానవ హక్కుల వేదిక నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షుడు పొద్దనూరు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వి.దిలీప్, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు హనుమాన్ ప్రసాద్, పద్మజ, పాలకుర్తి శ్రీనివాస్, లవకుమార్, కర్ణాటక సమ్మయ్య, యుగేందర్, సదానందం, ఖమ్మం జిల్లా బాధ్యులు ఆదినారాయణ, బెల్ట్ కార్మికులు యాదగిరి, వెంకటనారాయణ, విజయరావు, వెంకటేశ్వర్లు, చౌదరి, బుచ్చిరెడ్డి, చిటికెల కుమారి, లక్ష్మీ, అన్నపూర్ణతో పాటు సుమారు 150 మంది కార్మికులు పాల్గొన్నారు.

కూలీకి వచ్చి అనంతలోకాలకు..

హార్వెస్టర్ ఢీకొని ఒకరి మృతి ▸ మరొకరికి గాయాలు

టేకుమట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కూలి పని కోసం వచ్చిన ఓ మహిళ పైకి హార్వెస్టర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. రోడ్డుపై సేదతీరుతున్న ఆ మహిళపైకి ఒక్కసారి హార్వెస్టర్ వెనక్కి దూసుకురావడంతో పెద్దపల్లి జిల్లా మొట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(46) అక్కడిక్కడే మృతి చెందింది. మరో మహిళ వసంత గాయాల పాలైయిన ఈ ఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు వరి పొలంలో బెరుకులు తీసే పని నిమిత్తం మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి వచ్చారు. కాగా పని చేయాల్సిన పొలానికి వెళ్తుండగా ప్రధాన రహదా రిపై హార్వెస్టర్, ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావడంలో కూలీల ఆటోను డ్రైవర్ పక్కకు ఆపినట్లు తెలిపారు. కాగా ఆటోలో నుంచి మొట్లపల్లి గ్రామా నికి చెందిన దాసరి కనుకమ్మ, రాగుల వసంతలు దిగి పక్కన నిలుచోగా బస్సుకు దారిచ్చే క్రమంలో హార్వెస్టర్ డ్రైవర్ తన వాహనాన్ని ఒక్కసారిగా వెనక్కి అనడంతో ప్రమాదంలో జరిగినట్లు తెలిపారు. కాగా ప్రమాదంలో కనకమ్మ అక్కడి క్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న వసంతకు గాయాలు అయినట్లు తెలిపారు. కాగా స్థానికులు 108లో గాయాలపాలైన వసంతను చిట్యాల సామాజిక ఆసుపత్రికి తరలించారు.



కనకమ్మ (ఫైల్)



గాయపడిన వసంత

యత్నారం అడవుల్లో ఎలుగుబంటి కళేబరం

విద్యుత్ తీగలు అమర్చి వేటాడి మాంసం తీసుకెళ్లిన వేటగాళ్లు

మహాముత్తారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో రోజురోజుకు వేటగాళ్లు బరితెగిస్తున్నారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు, ఉచ్చులకు ఎన్నో వన్యప్రాణుల ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా మండలంలోని మారుముల గ్రామాల్లో రాత్రి పూట వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. పెగడపల్లి రేంజీ పరిధిలోని యత్నారం గ్రామ సమీప కొండెంగల వాగు సమీపంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ఎలుగుబంటి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. వేటగాళ్లు వాగు సమీపంలో ఎలుగుబంటి మాంసాన్ని, గోర్లను తీసుకొని కలేబారాన్ని అక్కడే వదిలివెళ్లారు. అయితే స్థానిక ఫారెస్టు ఈ విషయం ముందే తెలిసినా గోప్యంగా ఉంచారనే ఆరోపణలు వినిస్తున్నాయి. సోమవారం కొంత మంది గ్రామస్థులకు విషయం తెలియడంతో ఎలుగుబంటి మృతి చెందిన విషయం బయటకు వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. యత్నారం గ్రామ సమీప అడువుల్లోంచి వెళ్తున్న త్రీ ఫేజ్ విద్యుత్ తీగలను ఆసరాగా చేసుకొని వేటగాళ్లు ప్రతి రోజు రాత్రి పూట విద్యుత్ తీగలు అమర్చి వేట కొనసాగిస్తున్నారు. వన్యప్రాణుల మాంసాన్ని స్థానికేతరులకు గుట్టుగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకొంటున్నారని, ఈ విషయంలో స్థానిక ఫారెస్టు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామానికి సమీపం నుంచి అడవిగుండా వెళ్తున్న పెద్దవాగులో నిత్యం నీళ్లు ఉండడంతో దాహం తీర్చుకోవడానికి అటుగా వచ్చిన వన్యప్రాణులు వేటగాళ్లకు బలవుతున్నాయి. వేటగాళ్లను కట్టడి చేయడంలో ఫారెస్టు అధికారులు విఫలమౌతుండడంతో వేటగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఈ విషయంలో భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి వివరణ కోరగా ఎలుగుబంటి మృతి చెందిన ఘటనలో విచారణ జరుగుతుందని, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.



మాంసం తీసుకెళ్లి కళేబరం వదిలి వెళ్లిన వేటగాళ్లు

ఎలుగుబంటి మృతిపై విచారణ

మహాముత్తారం మండలం యత్నారం అడవిలో ఎలుగుబంటి కళేబరం లభ్యమైన ఘటనలో అటవీ శాఖ కాళేశ్వరం జోనల్ ఫ్లయిగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో జోగేందర్ సోమవారం సాయంత్రం విచారణ జరిపారు. ఎలుగుబంటి రెండు రోజుల క్రితం మృతి చెందితే ఇప్పటి వరకు వేటగాళ్లను ఎందుకు పట్టుకోలేకపోయారని పెగడపల్లి రేంజ్ అటవీశాఖ అధికారులను ప్రశ్నించారు. ఒక్కరోజులో వేటగాళ్లను గుర్తించాలని ఆదేశించారు. విచారణ జరిపిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.

పులి జాడ కోసం గాలింపు

తాడ్వాయి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బయ్యక్కపేట శివారు ముసలమ్మపెంట గొత్తికోయ గూడెంలోని పొడియం సత్యం అనే వ్యక్తికి చెందిన ఆవుపై మూడు రోజుల క్రితం శుక్రవారం పులి దాడి చేసిన విషయం తెలిసిందే.. అయితే అటవీ అధికారులు గాలింపు చర్యలు సోమవారం ముమ్మరంగా చేపట్టారు. పులి ఎటు వెళ్లిందని పలు రకాలుగా విచారణ చేస్తున్నారు. కాగా వట్టివాగు పరిసరాల్లో, నీలంతోగు, ముసలమ్మ పెంట ప్రాంతాల్లో కలియదిరిగారు. ట్రాప్ కెమెరాలను పరిశీలించారు. సమాచారం లభించకపోవడంతో పక్క రేంజ్ అధికారులకు సమాచారం అందించడం జరిగిందని ఓ అటవీ శాఖ అధికారి తెలిపారు. పరిసర గ్రామాల్లో ప్రజలకు సరైన సమాచారం తెలియక పోవడంతో పశు, జంతువుల కాపరులు, రైతులు భయంతో ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు పరిసర గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో అసలు పులి ఉందా... లేదా... అనే అంశంపై గ్రామస్థుల్లో చర్చ మొదలైంది.

విద్యుత్ ఆదాతోనే గృహజ్యోతి

200 యూనిట్లు మించి వాడితే మొత్తం చెల్లించాల్సిందే..



వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులతో వేసవికి ముందే ప్రజలు వేడికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి పట్టణ, మండల, గ్రామస్థాయిలో ఏసీలు, కూలర్లు వాడుతుండడంతో మార్చి మొదటివారంలోనే విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. విచ్చలవిడిగా వాడితే గృహజ్యోతి పథకం వర్తించకుండా పోయే ప్రమాదం ఉంది. 200 యూనిట్లకు ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా బిల్లు కట్టాల్సిందే. ఒక వైపు వేసవితాపం.. మరోవైపు విద్యుత్ బిల్లుల భారం.. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాల్సిన పరిస్థితి. దీని నుంచి గట్టెక్కాలంటే విద్యుత్‌ను పొదుపుచేసుకోవడమే మార్గం. అలా అని ఉపకరణాలను పక్కనపడేయకుండా విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే మేలు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంట్లో నిరంతరాయంగా గృహజ్యోతిని వెలిగించవచ్చు.

మన ఇళ్లలో ఇలా చేద్దాం..

మార్కెట్‌లో ఎన్నో కంపెనీల విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్రిడ్జిలు, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులను 1-5 స్టార్లతో విక్రయిస్తారు. వీటిలో 5 స్టార్ రేటింగ్ ఉపకరణాలే విద్యుత్‌ను తక్కువగా ఖర్చు చేస్తాయి. ఐఎస్ఐ మార్కు గల ఉత్పత్తుల వాడకం అన్ని విధాలా సురక్షితమైనది. వీటి వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. పాత తీగలుంటే మార్చుకోవడం శ్రేయస్కరం. టీవీని అవసరం లేనపుడు రిమోట్‌తో కాకుండా పూర్తిగా ఆఫ్ చేయాలి. సెల్‌ఫోన్ చార్జింగ్ నిండాక చార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి. బయటకు వెళ్లినా, అవసరం లేదనిపించినా ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేయాలి. కాలానుగుణంగా ఆధునిక సాంకేతికత గల ఫ్రిజ్‌ను మార్చుకుంటే నెలవారి విద్యుత్ వాడకం ఆదా అవుతుంది. అంతేకాకుండా ఏసీలను 24-28 డిగ్రీల మధ్య నడుపుకోవాలి. మార్కెట్‌లో పలు కంపెనీల సింగిల్, డ్యూయల్ ఇన్వెర్టర్ల ఏసీలు అందుబాటులో ఉన్నాయి. నిర్దేశిత ఉష్ణోగ్రతకు వాతావరణం మారగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అయ్యేవాటిని వాడాలి. పాతవాటికి సకాలంలో మరమ్మతులు చేయించాలి. అన్నిచోట్ల ఎల్‌ఈడీ బల్బులు వినియోగం అత్యుత్తమం.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఇళ్లల్లో విద్యుత్ ఆదాకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ సరఫరా అయ్యే తీగలు, ఇంట్లో గదులకు సరఫరా చేసే తీగల్లో గేజ్ అధికంగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువగా ఎల్‌ఈడీ బల్బులు వినియోగించాలి. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు వాడాలి. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడాలంటే ప్రణాళికబద్ధంగా ఉపకరణాలు వినియోగించుకోవాలి. గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- తరుణ్, ఏఈఈ వర్ధన్నపేట

	సామర్థ్యం (వాట్స్‌లో	వాడకం (రోజులో గంటల్లో)	నెలకు ఖర్చయ్యేది
ఫ్యాన్	60	15	27
టీవీ	100	06	18
ఎల్‌ఈడీ బల్బు	40	10	01
వాషింగ్ మెషిన్	300	02	18
మిక్సీ / గ్రైండర్	450	01	13
వాటర్ హీటర్	3000	01	20
బోర్ మోటర్	300	01	20
ఏసీ	1500	2-5	90-120

పుస్తకంతో నేస్తం చేద్దాం..

- పుస్తక పఠనంతో ప్రయోజనాలు అనేకం
- వేసవి సెలవులు చిన్నారులకు అనుకూలం
- సెల్‌ఫోన్ పక్కన పెడితే కావలసినంత సమయం
- విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచేందుకు దోహదం





కరీమాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రతీ ఇంట్లో పుస్తకాలు తప్పకుండా ఉండేవి. నేడు వాటి స్థానంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు వచ్చేశాయి. సమాజం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా పుస్తకా స్థానాన్ని భర్తీ చేయలేవు. పుస్తకాలు మనకు నేస్తాల్లాంటివి. అందుకే 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు పెద్దలు. 'పుస్తకం హస్తభూషణం' అని వర్ణించారు కవులు. కానీ నేటి సమాజంలో పుస్తకాలు కనుమరుగవుతున్నాయి. పాఠ్య పుస్తకాలు పెరిగిపోయి.. విజ్ఞానం, కథల పుస్తకాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. గ్రంథాలయాలకు వెళ్లి చదువుకునేంత తీరిక, ఓపిక తగ్గిపోతున్న రోజులివి. ఇంటిల్లిపాదీ ఆనందంగా ఒక మంచి పుస్తకాన్ని గురించి మాట్లాడుకునే పరిస్థితి ఎప్పుడో పోయింది. కేవలం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల కాలంలో ఉన్నాం మనం. మనసుతో మాట్లాడే నేస్తాలు పుస్తకాలే అనే విషయాన్ని విస్మరించాం. ఈ వేసవిలో అయినా పిల్లలకు మంచి నేస్తాల్లాంటి పుస్తకాలను పరిచయం చేద్దాం. పెద్దలు చెప్పిన మాటను నిజం చేద్దాం..

పుస్తకాలతో తెలివితేటలు

పిల్లలు పెరిగే క్రమంలో తమ చుట్టూ కనిపించే ప్రతీ విషయం మీద ఆసక్తి పెంచుకుంటారు. వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. తల్లితండ్రులు వివేకవంతులైతే వారి సందేహాలను నివృత్తి చేస్తూ వారికి విషయ పరిజ్ఞానాన్ని అందిస్తారు. లేదంటే వారి అనుమానాలు అలాగే ఉండిపోతాయి. అవి తీరాలంటే పుస్తక పఠనం తప్పనిసరి. పుస్తకాలు చదవడం వల్ల విషయం విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం కూడా పెరుగుతుంది. ప్రతీరోజు నిద్రపోయే ముందు చిన్నారులతో కథల పుస్తకాలు చదివిస్తే భవిష్యత్తులో వారి తెలివితేటలు బాగా అభివృద్ధి చెందుతాయని ఓ అధ్యయనంలో తేలింది. పడుకునే ముందు 20 నిమిషాల పాటు కథల పుస్తకాలు చదివే పిల్లల్లో అక్షరాస్యత శాతం మెరుగుపడుతుంది. చిన్న వయసులో పిల్లలు కథలంటే ఎలాగూ ఆసక్తి చూపుతారు. అలాంటి వారికి కథల పుస్తకాలు చదివే అలవాటు చేయాలని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

అలవాటు చేయండిలా...

పుస్తక పఠనం పిల్లలకు ఎంత తొందరగా అలవాటు చేస్తే అంత మంచిది. బాలల సాహిత్యానికి సంబంధించిన ఆసక్తికర పుస్తకాల ను కూడా చదివించాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు తమకు తెలియకుండానే పుస్తకాల పట్ల ఆకర్శితులవుతారు. వారికి ఏమైనా సందేహాలు వస్తే మనమే నివృత్తి చేయాలి. పుస్తక పఠనం ద్వారా కొత్త కొత్త పదాలు నేర్చుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పిల్లల వయసుకు తగ్గ పుస్తకాలనే చదివించాలి. అలా కాకుండా ఏదో ఒక పుస్తకం ఇచ్చి చదివించడం అంటే పుస్తక పఠనంపై వాళ్ళకి ఆసక్తి నశించే ప్రమాదం ఉంది.

- పిల్లలను తల్లిదండ్రులు తరుచూ లైబ్రరీకి తీసుకెళుతూ ఉండాలి. అలా చేయడం వల్ల పిల్లల్లో పుస్తకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. పిల్లలను లైబ్రరిల్లో సభ్యులుగా కూడా చేర్పిస్తే ఇంకా మంచిది. దీని వల్ల పిల్లలు కొత్త స్నేహితులను సంపాదించుకోవడమే కాకుండా పుస్తకాలంటే కూడా అమితంగా ఇష్టపడతారు.
- పిల్లల చేత బాలల సాహిత్యంలో మాస్టర్ పీస్‌లుగా చెప్పుకునే పుస్తకాలు చదివించాలి.
- పిల్లల ఆసక్తి తగ్గట్టు పుస్తకాలను చదివించడం వల్ల పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుంది.
- మంచి పుస్తకాలను పిల్లలకు బహుమతిగా ఇస్తుండాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు మెల్లగా పుస్తక పఠనంపై మక్కువ చూపెడతారు. అలాగే తల్లిదండ్రులు కూడా పుస్తకాలు చదవడం వల్ల పిల్లలకు స్ఫూర్తిగా నిలబడతారు. చిన్నప్పటి నుంచి పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మంచి తెలివితేటలతో అన్నింటా ముందు వరుసలో ఉంటారు.
- బొమ్మలుండే పుస్తకాలను పిల్లలకు అందిస్తే పిల్లలు అందులోని సారాంశాన్ని తొందరగా అర్థం చేసుకుంటారు. పిల్లల చదువుపై కూడా పుస్తక పఠనం ప్రభావం ఉంటుంది. కథల పుస్తకాలు చదివిస్తుండటం వల్ల తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య ప్రేమ మరింత పెరుగుతుంది.



జేఎన్ స్టేడియంలో పావురాలకు గింజలను ఆహారంగా అందజేస్తున్న వాకర్స్

జేఎన్ఎస్‌కు కపోతాల కళ

- స్టేడియం వద్ద ముచ్చట గొలుపుతున్న పావురాలు
- ఆహారం అందిస్తున్న వాకర్స్

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఔట్ డోర్ స్టేడియం ప్రధాన ప్రాంగణం వద్ద కపోతాలు ప్రతీరోజు ఉదయం సందడి చేస్తున్నాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చే వాకర్స్ గేటు ముందుకు వచ్చే సమయంలో కపోతాలు పెద్ద ఎత్తున గుంపులుగా గుమికూడి అలరించడంతో వాటిని చూసి సంబరపడిపోతున్నారు. అక్కడే గేటు ముందు చిరు ధాన్యాలు విక్రయాలు చేయడంతో వాటిని వాకర్స్, పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి పావురాలకు అహారంగా అందించడంతో పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా చేరుకొని చిరు ధాన్యాలను స్వీకరిస్తూ, ముచ్చట గొలుపుతున్నాయి. చిరు ధాన్యాలు అందించే వ్యక్తి చేతిపై వాలి మొలకలు, గింజలను ఆరగిస్తూ కనివిందు చేస్తున్నాయి. దీంతో వాకింగ్ వచ్చే వారు కపోతాలకు చిరు ధ్యాన్యాలు అందించి వాటితో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు ఆసక్తిని కనబర్చుతున్నారు. చిన్న పిల్లలు కపోతాలను చూసి వాటితో ఆడుకోవాలను ఆరాటంతో గింజలను చల్లుతూ వాటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- వరంగల్ స్పోర్ట్స్

పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్



ప్రమాదానికి కారణమైన లారీ

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు అతివేగంగా ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సత్తి రాజేశ్వరరావు - అనంతలక్ష్మిల కుటుంబం హైదరాబాద్‌లోని గాజుల రామారంలో కొన్నేళ్ల కిందట వచ్చి స్థిరపడింది. రాజేశ్వర్‌రావు - అనంతలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీను (50), కోడలు రమణకుమారి (40), మనువడు సత్య అరవింద్, మనువరా లు అనూష (22)లు కలిసి సోమవారం ఉదయం కారులో గాజులరామారం నుంచి భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. అక్కడ పూజలు ముగించుకొని సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 5గంటల సమయంలో మండలంలోని రాఘవపూ ర్ గ్రామ శివారులో ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న శ్రీను, ఆయన భార్య రమణకుమారి, కూతురు అనూషలు అక్కడికి అక్కడే మృతి చెందారు. కారులో వెనుక కూర్చున్న రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, శ్రీను కుమారుడు సత్య అరవింద్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కొని తీవ్రంగా గాయపడిని రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్య అరవింద్‌లను జనగామ ఏరియా అస్పత్రికి తరలించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను పోలీసులు వెలికితీయడానికి శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌సీటులో ఉన్న శ్రీను తలపగిలిపోయి కారులో ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్‌ను తీసుకువచ్చి మృతదేహాన్ని వెలికితీయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో జనగామ ఏరియా ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సీఐలు జి.వేణు. ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నరేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.



తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి

ప్రమాదకరంగా మట్టి పెల్లలు





రోడ్డుపై ప్రమాదకరంగా మారిన మట్టి పెల్లలు

ఫోటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / హనుమకొండ

హనుమకొండ భద్రకాళి చెరువునుంచి మట్టి తరలిస్తుండటంతో హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై మట్టిదిబ్బలు ప్రమాదకరంగా మారాయి. లారీల ద్వారా తరలిస్తున్న మట్టి.. రోడ్డుపై పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనిని రోడ్డు పైనుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

నన్ను జర బాగు చేయరూ..

- ఎందరికో సమాచారం అందించా..
- ఓ పోస్టు బాక్స్ మనోవేదన



బాలసముద్రంలో శిథిలావస్థలో ఉన్న పోస్టు బాక్స్

నేనొక పోస్ట్ బాక్స్‌ను. హనుమకొండ బాలసముద్రంలో సుమారు 30 ఏళ్ల కిందట నన్ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ మీకు సేవ చేశాను. ఎన్నో ఉత్తరాలను నాలో భద్రపరిచాను. నా వాళ్ల (సిబ్బంది) చేత మీ వాళ్లకు వేల సంఖ్యలో ఉత్తరాలు అందించాను. అందరి యోగ క్షేమాలు పరస్పరం తెలియపరిచాను. ఎన్నో శుభ, అశుభ కార్యాల సమాచారం అందించాను. ఇప్పుడంటే సెల్‌ఫోన్లు వచ్చాయి. కానీ సుమారు పదిహేనేళ్ల కిందటివరకు మీరు ఎక్కడున్నా.. మీ క్షేమ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులకు అందించింది నేనే. ఎంతోమంది నిరుద్యోగులకు సమాచారం ఇచ్చి ఉద్యోగాలు పొందేందుకు దోహదపడింది నేనే. దేశ, విదేశాల్లో ఉన్న మీ వాళ్ల బాగోగుల సమాచారం ఇచ్చింది నేనే. నేను పంపే ఉత్తరం కోసం మీరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే వారు. అలాంటి నేను ఇపుడు వృద్ధాప్య దశ (శిథిలావస్థ)కు చేరుకున్నాను. నన్ను బాగు చేయించడానికి నా వాళ్లు (అధికారులు) కనికరించడం లేదు. అందరూ ఉన్నా అనాథలా ఉండిపోతున్నాను. దయచేసి మీలో ఎవరైనా నా అవస్థను మా పుట్టింటికి (తపాలా శాఖకు) తెలియజేసి నన్ను బాగుచేయించాలని చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

ప్రేమతో..
మీ పోస్ట్ బాక్స్

- హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

మండే ఎండలో ఉపశమనం ఎలా..?

- వేసవిలో ఉపాధి హామీ కూలీల కష్టాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో మట్టి పనులు చేయడం ఉపాధి హామీ కూలీలకు కష్టసాధ్యంగా మారింది. పైగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం ఉండడం లేదు. ఎవరికి వారే తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర ఔషధాల కిట్లు అందుబాటులో ఉండడం లేదు.

గతంలో ఇలా..

ఉపాధిహామీ పథకంలో గతంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం ఖర్చు కింద గడ్డపారకు రూ.10లు, తట్టకు రూ.5లు, ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.20లు చొప్పున ఇవ్వాలి. వీటితోపాటు పని ప్రదేశంలో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎదురయ్యే సమస్యలు ఇవే...

ఎండలో ఎక్కువ సేపు పనిచేయడం వల్ల కూలీలకు వడదెబ్బ తగితే ప్రమాదం ఉంది. పని ప్రదేశాల్లో తాగు నీరు సరిపడా లేకపోవడం వల్ల నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు. ఎండల వల్ల చర్మ సమస్యలు, అలసట, తలనొప్పివంటివి ఎదురవుతాయి.

స్వీయ జాగ్రత్తలే కీలకం

ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీళ్ల ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నపుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు పనిచేయడం మంచిది. పని మధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే విశ్రాంతి తీసుకోవాలి. తలనొప్పి, మైకం, వాంతులు, చెమట ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సహాయం తీసుకోవాలి. బాధిత వ్యక్తిని నీడప్రదేశంలోకి చేర్చి శరీరాన్ని తుడవాలి. ఉప్పు, చెక్కెర కలిపిన ఆహారం లేదా పండ్లు తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి, లవణాలు నిల్వ ఉంటాయి. పని ప్రదేశానికి సమీపంలోని వైద్య కేంద్రం వివరాలు తెలుసుకోవాలి.

జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి



మహబూబాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

(5వ పేజీ తరువాయి)

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, డీఎస్పీ తిరుపతిరావు, సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, వివిధ ప్రజా సంఘాల నాయకులు గుగులోతు కిషన్‌నాయక్, కామ సంజీవరావు, బొడ్డుపల్లి ఉపేంద్రం, మైస శ్రీనివాస్, అజ్మీర సురేష్, గుగ్గిళ్ల పీరయ్య, కొండ్ర ఎల్లయ్య, దుడ్డెల రామమూర్తి, మహేష్, ఐలేష్, నాజర్, లక్ష్మణ్, సామెల్, వీరన్న, వీరస్వామి, సుధాకర్, యుగేందర్, రామకృష్ణ, వివేక్, గుగులోతు భీమా, విజయలక్ష్మి, రజినీకాంత్, అశోద భాస్కర్, బోడ రమేష్, చందులాల్, మనోజ్, మంద శశి, మధు, రేణుక పాల్గొన్నారు.

• కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్ నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ చైర్మన్ సుధాకర్ నాయక్, వైస్ చైర్మన్ మదన్‌లోయా, నీరుటి సురేష్ నాయుడు, పోతురాజు రాజు, బండి శ్రీను, ఆరెందుల వెంకటేశ్వర్లు, చెన్నూరి విజయలక్ష్మి, బోడ రవి, శంతన్‌రామరాజు, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, యాకయ్య, జగన్, శ్రీధర్, భూక్య లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

• టీడీపీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, పేరం వీరస్వామి, డి.రాములు పాల్గొన్నారు. టీడీపీ ఆఫీస్‌లో జరిగిన వేడుకల్లో పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు, సుతారపు వెంకటనారాయణ, భూక్య సునితమంగీలాల్, ప్రేమ్‌చంద్‌వ్యాస్, బొమ్మ వెంకటేశ్వర్లు, కొండపల్లి రాంచంద్రమ్మ, బాలునాయక్ పాల్గొన్నారు.

• సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, శ్రావణ్, రమేష్, రవీందర్, అశోక్, ప్రవీణ్, శ్రీనాథ్, శంకర్, పద్మ, పాల్, శ్యాంప్రసాద్, నక్క నాగార్జున, మల్లయ్య పాల్గొన్నారు.

• టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహనీయుల స్మృతిలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో విప్లవ విద్యార్థి జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించకుని నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర నాయకులు సిద్దోజు కవిత, మైస శ్రీనివాస్, విష్ణువర్ధన్, శ్రీశైలం, సువర్ణ, ఉపేందర్, శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, టీపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మైస నాగయ్య, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

• మానుకోట ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో గుగులోతు వంశీ, రియాజ్ అన్సారీ, చైతన్య, వినయ్, ఫారూఖ్‌పాల్గొన్నారు.

• బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, గడ్డం అశోక్, పొదిల నర్సింహారెడ్డి, మోసంగి మురళీ, వెన్నమల్ల అజయ్, ఆకుల శ్రీనివాస్, చెల్పూరి వెంకన్న, సిరికొండ సంపత్, రాంబాబు, వెన్నమల్ల సందీప్, పల్లె సందీప్, ఓర్సు పద్మావతి, రాధపటేల్, జహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని సోమవారం నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని చోట్ల నూతనంగా ఏర్పాటు చేసిన అంబద్కేర్ విగ్రహాలను ఆవిష్కరించారు.

• చిన్నగూడూరులో అంబేద్కర్ విగ్రహానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, రాంరెడ్డి, అనిల్, శేఖర్, మురళీధర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, శివయ్య, శ్రీనివాస్, నవీన్, మధు పాల్గొని పూలమాలలు వేశారు. జయ్యారంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని చిన్నగూడూరు ఎస్సై ప్రవీన్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంచర్ల సోమయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, వీరభద్రం పాల్గొన్నారు.

• మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్ నాయక్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ నేత యుగేందర్‌రెడ్డి, యువజన సంఘం బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. మరిపెడలో అంబేద్కర్ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. పురుషోత్తమాయగూడెం వేడుకల్లో స్నేహ యూత్ బాధ్యులు నూకల అభినవ్ రెడ్డి పాల్గొన్నారు. చిల్లంచర్లలో మాజీ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, మరిపెడ పీహెచ్‌సీలో డాక్టర్ రవి అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. సీపీఐ వేడుకల్లో ఆపార్టీ బాధ్యులు అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

• దంతాలపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

• నర్సింహులపేట మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయా వేడుకల్లో ఎస్సై సురేష్, ఎంపీడీవో కిన్నెర యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

• పెద్దవంగరలో అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, శ్రీనివాస్, సీతారాంనాయక్, కర్ణాకర్, రవీందర్‌రెడ్డి, సత్యం, వేణు, లింగమూర్తి, వెంకన్న, ఉప్పలయ్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బీఆర్ఎస్ వేడుకల్లో నాయకులు చీదర ఐలయ్య, రాంచంద్రశర్మ, సుధీర్, సమ్మయ్య, జనార్దన్, వెంకన్న, భిక్షపతి, శ్రీనివాస్, అనిల్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

• తొర్రూరులో అంబేద్కర్ విగ్రహానికి వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయా వేడుకల్లో నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, రాంచంద్రయ్య, రామకృష్ణ, రాజశేఖర్, సంతోష్, రాజేష్, సీతారాములు, శ్రీను, విశ్వేశ్వర్‌రావు, అశోక్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

• గార్ల మండల కేంద్రంతో పాటు చిన్నకిష్టాపురం, సీతంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సుందర్, రాంసింగ్‌నాయక్, రాంకుమార్‌నాయక్, భీముడు, చిట్టిబాబు, నాగమణి, ఎల్లయ్య, ఎస్సై రియాజ్ పాషా, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, విమల్‌కుమార్ జైన్, శ్రీనివాస్, సత్యవతి, వెంకన్న, లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

• డోర్నకల్ మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.కార్యక్రమంలోవిద్యాసాగర్, సీతారాములు, వెంకన్న పాల్గొన్నారు. అంబేద్కర్ భవన్ వేడుకల్లో వీరస్వామి వెంకటేశ్వర్లు, రమణ పాల్గొన్నారు. గొల్లచర్లలో కేవీపీఎస్ వేడుకల్లో వెంకట్రాములు, సైదులు, శ్రీనివాస్, బిక్షంరెడ్డి, సమ్మిరెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు. డోర్నకల్ గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నందానాయక్,శంకర్,ఖాదర్‌బాబా,ప్రవీణ్ పాల్గొన్నారు.

• కొత్తగూడలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం, ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వాసం వీరస్వామి, సుంక సారయ్య, యాకయ్య, వెంకన్న, వజ్జ సారయ్య, నారాయణరెడ్డి, రూప్‌సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, మురళి పాల్గొన్నారు.

• నెల్లికుదురులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. హెచ్.వెంకటేశ్వర్లు, వెంకన్న, నెహ్రూనాయక్, ఉప్పలయ్య, మహేందర్, శరత్, బాలాజీనాయక్, వెంకటేష్, రమేష్, ప్రకాష్, భాస్కర్, ప్రశాంత్, గుట్టయ్య, బాబుగౌడ్, తిలక్ బాబు, ఐలయ్య, మల్లేషంచ సతీష్, రాజేష్, తిరుపతాచారి, మధుకర్, వివేక్, ఉప్పలయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.

• కేసముద్రంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించారు. మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, ఎస్సై మురళీధర్‌రాజు, గుగులోతు దస్రూనాయక్, అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, వెంకట్రాంనర్సయ్య, వివేకవర్ధిని పాఠశాలలో చిర్రయాకాంతంగౌడ్ పాల్గొన్నారు

• ఇనుగుర్తిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలోనిర్వహించిన వేడుకల్లో వెంకన్న, రామ్మూర్తి, చంద్రయ్య, సతీష్, కట్టయ్య, రాము, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, యాకన్న, ప్రభాకర్ రెడ్డి, హరిచందు, రాము, శ్రీనివాస్‌లు పాల్గొని నివాళ్లర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి అధికారి హరిప్రసాద్ నివాళ్లర్పించారు.

• కురవిలో అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, నూకల వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ శరత్, ఎన్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, లక్ష్మణ్, శ్యామల శ్రీను, దయ్యాల శ్రీధర్ పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టగా దడిగల శరత్, మురళీ, అనిల్, ప్రతాప్‌నాయక్, గణేష్, ప్రశాంత్ భరత్ పాల్గొన్నారు. సీపీఐ వేడుకల్లో జిల్లా సమాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, రాజన్న, సమ్మయ్య, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు. నారాయణపురంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అల్లూరి రవిరాజు, చంటి రాజు, కిషోర్‌రాజు పాల్గొన్నారు.

• బయ్యారంలో అంబేద్కర్ విగ్రహానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, మూల మధుకర్‌రెడ్డి, ముసలయ్య, వీరారెడ్డి, సత్తిరెడ్డి, రామునాయక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సేవాలాల్‌సేన, ఎల్‌హెచ్‌పీఎస్, లంబాడ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రవి, శ్రీను, నరేష్, కోటేశ్వర్‌రావు, సునిల్, దేవోజీ పాల్గొన్నారు, ఎమ్మార్పీఎస్ వేడుకల్లో శ్రీనివాస్,రవి, గణేష్, భిక్షపతి, ఉపేందర్, నాగరాజు, శేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సీపీఎం వేడుకల్లో రాజన్న, నాగేశ్వర్‌రావు, వెంకన్న, చంటి, మోహన్, రాము పాల్గొన్నారు.

• గూడూరు, గుండెంగ, పొనుగోడు, లక్ష్మిపురం, మట్టెవాడ గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కత్తి స్వామి, నూనావత్ రమేష్, వీరస్వామి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కొమ్మాలు, నర్సయ్య, ఉపేందర్, పార్నంది రామయ్య, సురేందర్, రమేష్, సురేందర్, మంగీలాల్, జైసింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

• తొర్రూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారి పూర్ణచందర్‌రెడ్డి, వినయ్, తహసీల్ ఆఫీస్‌లో అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. మాటేడు, పత్తేపురం, ఎలికట్టె గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమ్మాపురంలో ఉపాధి హామీ పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ యాకయ్య ఆధ్వర్యంలో కూలీలు అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



దంతాలపల్లిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, రెడ్యానాయక్



తొర్రూరులోని అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు



డోర్నకల్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు



మరిపెడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు



బయ్యారంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో రాజకీయ ఆధిపత్యం!?

• ఎట్టకేలకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేచే ఆవిష్కరణలు

బయ్యారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో రాజకీయ ఆధిపత్యం చోటుచేసుకోవడంతో కొంత కాలంగా విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం వివాదాస్పదంగా మారిం ది. దీంతో ఎట్టకేలకు జఠిలంగా మారిన వివాదం సద్దుమణిగి విగ్రహాల ఆవిష్కరణ జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం మండలంలోని బాలాజీపేట గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనక య్య అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించగా.. గౌరారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.కాగా, మూడు మాసాలుగా వివాదాస్పదంగా మారిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఎట్టకేలకు సద్దుమణిగి ఆవిష్కరణలు పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకల్లో వాగ్వాదం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎల్‌హెచ్‌పీఎస్, దళిత సంఘాల నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ జయంతి వేడుక వేదికపై ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఆ శాఖ ఇన్‌చార్జ్ అధికారి నర్సింహస్వామి ఆసీనులయ్యారు. కార్యక్రమం ఆరంభ సమయంలో బహుజన వాది డాక్టర్ వివేక్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వేదికపై కుర్చీ వేసే ప్రయత్నం చేస్తుండగా దళిత సంఘాల నాయకులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ ఇరువర్గాలకు నచ్చజెప్పి శాంతింప చేయడంతో కార్యక్రమం యథావిధిగా కొనసాగింది. జయంతి వేడుకలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ప్రసంగాల తర్వాత కార్యక్రమం ముగిసిందని అధికారి ప్రకటిస్తుండడంతో దళిత, గిరిజన సంఘాల నాయకులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి.. అధికారులు కార్యక్రమాన్ని కొనసాగించాలని అనడంతో విప్ రాంచందర్ నాయక్ వేదిక వద్ద కూర్చొని దళిత సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. వారు సమస్యలు చెప్పడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

భూభారతి పోర్టల్ విడుదల అభినందనీయం

గార్ల, ఏప్రిల్ 14 (అంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి పోర్టల్‌తో తమకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం భూభారతి పోర్టల్ విడుదల చేసిన సన్నివేశాలను తిలకిస్తూ రైతులు సంబరాలు జరుపుకొని స్వీట్లు పంచుకున్నారు. భూభారతి పోర్టల్ విడుదల అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కావటి రామారావు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంపన్నులకు పంచారు.. పేదలను ఊడ్చారు.. : విప్

చిన్నగూడూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల హయాంలో సంపన్నులకు పంచి పేదలను ఊడ్చివేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని జయ్యారం, ఉగ్గంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు కురవి మండలం నేరడలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా 25 లక్షల మంది రైతులకు రూణమాఫీ, 60 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తామన్నారు. వృద్ధులకు, వితంతువులకు ఆర్థిక భారం వల్ల పింఛన్లు ఆలస్యమయ్యాయని, త్వరలో పెంచిన పింఛన్లు అందిస్తామన్నారు. ఇసుక అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, రాంరెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఏపీఎం పాపయ్య, సీసీలు మల్లేశం, శ్రీరాములు, నాగేష్, యాకన్న, మేగ్యా, జగన్, రమేష్, మంజులరాములు. శ్రీను, మురళి, భద్రయ్య, వెంకటయ్య, కురవి దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, అంబటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టంతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా ఉందని వక్ఫ్‌బోర్డు పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. మహబూబాబాద్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సోమవారం వక్ఫ్‌బోర్డు పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని పటిష్టం చేస్తామన్న పేరుతో వాటి ఆస్తులను చట్టం మాటున లాక్కొని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ముస్లింల హక్కులను కేంద్రం కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకునేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్డీ.ఫరీద్, ఖలీల్‌పాషా,వాహేద్, సత్తార్, ఇబ్రహీం, మహబూబ్ పాషా, నాసర్, అసద్ అలీఖాన్, ఎంఏ.రహీం, ఇస్మాయిల్, యూసుబ్, సుభానీ, జావిద్, రియాజ్, జాకీర్, జమీర్, అమీర్‌ఖాన్, రబ్బానీ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి చందాలు ఎవరికీ ఇవ్వొద్దు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పాత బజారులోని పురాతన అంజనేయస్వామి దేవాలయ నూతన నిర్మాణం కోసం దాతలు ఎవరికీ చందాలు ఇవ్వవద్దని స్థానిక వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మదన్‌గోపాల్ లోయా అన్నారు. అంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 70 సంవత్సరాల నుంచి అంజనేయస్వామి దేవాలయంలో దూప, దీప నైవేద్యం చేసేది మార్వాడి కులస్థులేనని, భవిష్యత్‌లో గుడి అభివృద్ధి మార్వాడీల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని చెప్పారు. త్వరలోనే గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేసి 2026 వరకు పూర్తి చేస్తామన్నారు. గత కొంతకాలంగా కొంత మంది వ్యక్తులు గుడి నిర్మాణం పేరిట డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎవరూ చందా రూపంలో డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. సమావేశంలో అశోక్‌ఝూవర్, ప్రేమ్‌చంద్ వ్యాస్, ఎస్ఎస్‌లోయా, గోపాల్‌గిలడా, సూరజ్‌లోయా, రాజేష్, వేణులోయా, బ్రిడ్జి అసోపా, పూనంచంద్‌మాల్పానీ, క్యాచువల్ శ్యాం సుందర్‌శర్మ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి

• ప్రభుత్వ విప్ జాటోతు రాంచందర్ నాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండ తీవ్రతతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాల్లో విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.శ్రీనాథ్, బి.కృష్ణ, కె.రవీందర్, జి.వెంకన్న, పున్నం చందర్, గోపి, విశ్వనాథ్, జీవన్, రవి తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విప్ రాంచందర్ నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

ఎప్పుడు ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయం

• జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ మంత్రి రెడ్యానాయక్

దంతాలపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, మాజీ మంత్రి రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వారు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందాయన్నారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ధర్మారపు వేణు, జాటోతు కిషన్‌నాయక్, సోమేశ్వర్, కిషోర్, వెంకన్న, సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీపీఐ నేతలు

మరిపెడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్‌ను సీపీఐ నేతలు సోమవారం మరిపెడలోని క్యాంపు ఆఫీస్‌లో మార్యదపూర్వకంగా కలిశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా సిఫారస్సు చేసినందున ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, మరిపెడ, కురవి, డోర్నకల్, చిన్నగూడూరు మండలాల సీపీఐ బాధ్యులు ఉన్నారు. కాగా, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

తొర్రూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేపట్టాలని సమస్యల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ తమ్మెర విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ పాలకులు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. సమస్యలు పేరుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారని, ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని అంగడి స్థలంలో నిర్మించాలని, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, ఫైర్ స్టేషన్, ఐబీ, పంచాయతీరాజ్, ఇంట్రా, గ్రిడ్ తదితర కార్యాలయాలను తొర్రూరులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి ప్రతిరోజు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులకు లిఖిత పూర్వకంగా వివరించినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమస్యల పోరాట వేదిక, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17 వరకు రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిచో నిరవధిక దీక్షలు, రాస్తారోకోలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి, కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బందు నారాయణ, కొత్తపల్లి రవి, భిక్షపతి, వీరన్న, యాకూబ్, సాయిలు, లింగయ్య, మహేందర్, యాకయ్య, ఎల్లయ్య, మురళీకృష్ణ, సుధాకరాచారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో దీక్ష చేస్తున్న పోరాట కమిటీ సభ్యులు

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

గార్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గార్ల నుంచి ఖమ్మంకు బయలుదేరిన కారు గార్ల సమీపంలో గండి చెరువు వద్ద రెండు చెట్లకు బలంగా ఢీకొట్టి లోయలోకి పల్టీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న గార్లకు చెందిన మట్టిపాక శివ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది, గుగులోత్ ప్రకాశ్, నరిగే శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

జలియన్‌వాలాబాగ్ అమరులకు నివాళి

కేసముద్రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో అమృత్‌సర్‌లో బ్రిటిషర్ల కాల్పుల్లో మృతి చెందిన అమరులకు ఆదివారం రాత్రి ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆధ్వర్యంలో నివాళులర్పించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డి.వీరన్న, వి.శ్రీరాములు, మల్లేశం, ఐలయ్య పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడికి రూ.2.16 లక్షల విరాళం

కేసముద్రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారిగుడి తండాలో నూతనంగా నిర్మించే దుర్గమ్మ గుడిలో అమ్మవారి విగ్రహం, గంటలు, కలశం, పూజా సామగ్రి కోసం బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్, ఆత్మ మాజీ చైర్మన్ పొలెపల్లి నెహ్రూరెడ్డిలు రూ.2.16 లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణ కమిటీ బాధ్యులు దాతలను సన్మానించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కేసముద్రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎంసీపీఐ మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిళి డిమాండ్ చేశారు. అమినాపురంలో సోమవారం పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ కార్యదర్శిగా చింతల రమను ఎన్నుకున్నారు. సమావేశంలో మండల నాయకులు జాటోత్ బిచ్యానాయక్, ఆంగోత్ మంగ్యా, అశోక్, బి.రవి, పార్వతి, ఓర్సు సావిత్రి, కొట్టం సుశీల, బానోత్ జ్యోతి, కొంగర శ్రీను పాల్గొన్నారు.